# జముకుల కథ
## (విజయనగరం బృందం)

జముకుల కథ విజయనగరం జిల్లాలో ప్రచారంలో ఉంది. ఈ కథ అతిప్రాచీన జానపద కళారూపం. ఈ జముకుల కథలో వీర, కరుణ, శృంగార రసాలు ప్రధాన పాత్రలుగా వస్తాయి. విజయనగరం జిల్లా చుట్టుప్రక్కల అనేకమంది కళాకారులు ఈ జముకుల కథ కళారూపాన్ని వృత్తిగా స్వీకరించి జీవనం సాగిస్తున్నారు. జముక ఆవిర్భావం గురించి ఈ కథ చెబుతారు. సుకేతుడనే రాక్షసుని సంహారం అనంతరం ఎల్లమ్మదేవి ఆ రాక్షసుడి వెన్నుమీద చర్మాన్ని వలిపించి ఒక డబ్బాకు మూతగా అమరింపచేసిందని, వెన్ను నరంతో తాడును తయారుచేయించి, కాలిమూలుగు దుమ్ముబిల్లగా తయారుచేయించిందని చెబుతారు. ఈ విధంగా జముక తయారయ్యిందని చెబుతారు.

జముకుల కథ చెప్పేవారు జముక వాద్యం, కుంచం ఆకారంలో ఉన్నదానికి ఒక ప్రక్క చర్మంతో మూసివేస్తారు. ఆ చర్మానికి మధ్య చిన్న రంధ్రం వేసి అందులో దూర్చి, కుంచంలోపల ఆ నరానికి చిన్న కర్రముక్క కడతారు. కుంచంలోపల ఆ కర్రను లాగి వదులుతుంటే ఒకరమైన ధ్వని వస్తుంది. అలా నరాన్ని లాగి వదులుతూ ఒక తాళానికి లయకు అనుగుణంగా వాయించడమే జముక వాద్యం. ఈ బృందంలో 7గురు కళాకారులు ఉంటారు. జముక, డోలక్, తాళం వాయించే ముగ్గురు మరియు వెనుక యిద్దరు ముందు యిద్దరు కథ, వచనం చెబుతూ ఉంటారు. వీరు చెప్పేకథలు (1) సారంగధర (2) సుభద్రాకళ్యాణం (3) శ్రీ కృష్ణజననం (4) పరశురామ యజ్ఞం (5) రేణుకా ఎల్లమ్మ మొదలైన 20 కథలు చెబుతారు. వీరితో మత్స్యకారులు ఎక్కువగా కథ చెప్పించుకుంటారు. జముకను కప్ప చర్మంతో తయారుచేస్తారు. మత్స్యకారులు వారి సముద్రవేటలో దొరికిన పెద్ద కప్పచర్మం వీరికి ఇస్తూవుంటారు. వీరందరూ హరిజన మాల కులస్థులు. వినాయక చవితికి, శ్రీరామనవమి, అమ్మవారి ఉత్సవాలకు పెళ్లిళ్లకు వీరి కథను చెప్పించుకుంటూ ఉంటారు.

జముకల కథ చెప్పేకథకుడి ఆహార్యం, తలపాగా, మెడలో హారం, చెవికి పోగులు, బొట్టు, వల్లెవాటు, దండకట్టు, కుచ్చిల్లుపోసి నిండుగా కట్టిన ధోవతి, మురుగులు, కాళ్లకు గజ్జెలు వంతలు కూడా తలపాగా ధరిస్తారు.

జముకుల కథను ప్రచారం చేసినవారిలో శ్రీ పీసాల లక్ష్మణరావు, శ్రీ చింతపూరి తవిటయ్య, శ్రీ మొదలి నరసింహా రావు, శ్రీ తమ్మిన రామారావు మొదలయినవారు.

జముకుల కథలో ప్రసిద్ధి చెందిన "కన్యక కథ" ను శ్రీ పిసాల లక్ష్మణ రావు రచించారు. ప్రజానాట్య మండలి వారు ఈ "కన్యక కథ"ను అనేకమార్లు చాలా ప్రదర్శనలనిచ్చారు. సమాజంలో మహిళలను జాగృతం చేసే ఇతి వృత్తంలో ఉన్న "కన్యక కథ"ను ప్రజలు చాలా బాగా ఆదరించారు. సాధారణంగా ప్రతి కథ ముగింపులో ఒక నీతి వాక్యమో ఆనాటి పాలకులకు కనువిప్పు కలిగించే సందేశము ఉంటుంది.